కానీ అణ్నా కరుణానిధితో ఏకీభవించాడు. "మనం ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి. కేంద్రమంత్రులు వచ్చినపుడు మనవాళ్లు నల్లజెండాలతో స్వాగతించాలి. ఇల్లాళ్లు వంటింట్లోని మసిగుడ్డలతో ప్రదర్శన నిర్వహించాలి. బోర్డులపై హిందీ పైన, తమిళం కింద రాయడం మనం ఒప్పుకోకూడదు. తమిళమే పైన వుండాలి." అన్నాడు. కరుణానిధి, సంపత్‌ల మధ్య జరిగిన వాగ్వివాదం తన పత్రికలో కూడా ప్రచురించలేదు అణ్నా. తర్వాత కూడా కరుణానిధికి, సంపత్‌కు పడేది కాదు. నెడుంజెళియన్, ఎన్ఎస్ కృష్ణన్ వంటి నాయకులను సంపత్ అగౌరవపరుస్తున్నాడని, ఆ విధంగా పరోక్షంగా అణ్నాను కించపరుస్తున్నాడని కరుణానిధి ఆరోపించేవాడు. సంపత్ దీనికి బహిరంగంగా సమాధానం చెప్పేవాడు కాదు. ఏది ఏమైనా 1960 వరకు వాళ్లిద్దరి మధ్య పొరపొచ్చాలు నడుస్తూనే వుండేవి.

"ఆర్య మాయై" కేసులో తిరుచ్చి కోర్టు తీర్పు వచ్చిన రోజునే "పొనిమొళిగళ్" అనే పుస్తకం విషయంలో పెరియార్‌పై తీర్పు కూడా వచ్చింది. ఇద్దరికీ శిక్ష పడింది. ఇద్దరూ ఒకే పోలీసు వ్యాన్‌లో జైలుకి వెళ్లారు. జైలుగదులు కూడా పక్కపక్కనే. ఇద్దరూ మాట్లాడుకునేవారు కారు, అలా అని పోట్లాడుకునేవారూ కారు. ఇద్దరినీ చూడడానికి చాలామంది వచ్చేవారు. వారిలో చాలామంది కాస్సేపు పెరియార్‌తో, కాస్సేపు అణ్నాతో మాట్లాడి వెళ్లేవారు. వీళ్ల ఖైదు పట్ల నిరసన ప్రదర్శనలు పెరగడంతో పది రోజుల్లోనే యిద్దర్నీ విడిచి పెట్టేశారు. విడుదల రోజున పెరియార్‌ను తీసుకుని వెళ్లడానికి కారు వచ్చింది. అణ్నా కోసం ఎవరూ రాలేదు. పెరియార్‌కోసం వచ్చినవాళ్లు అణ్నాను కూడా ఎక్కమన్నారు. పెరియార్‌ను దింపిన తర్వాత అతన్నీ కావలసిన చోటుకి దింపారు. కారులో వీళ్లిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. విడుదల చేసేరోజు పెరియార్ అణ్నాకు తోటి ఖైదీ ద్వారా ఆరు బిస్కట్లు పంపాడు. దానికే అణ్నా పులకించిపోయాడు. "ఆ రోజుల్లో పెరియార్ నా పట్ల ప్రేమాభిమానాలు కురిపించి వుంటే నేను కరిగిపోయి తన పార్టీని రద్దు చేసేవాడినేమో" అని తర్వాతి రోజుల్లో అణ్నా చెప్పుకున్నాడు.

కేంద్రం నుండి వచ్చిన నాయకులందరికీ నల్లజండాలతో నిరసన తెలపాలని డిఎంకె పార్టీ తీర్మానం చేసింది. ఢిల్లీ నుండి వచ్చిన ప్రతీవారికీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, ప్రధాని నెహ్రూ, హోం మంత్రి రాజాజీ - యీ సన్మానం తప్పలేదు. డిఎంకె పార్టీ జిల్లా స్థాయిలో అనేక సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలు, సాంఘిక సంస్కరణ, మహిళా హక్కులు, భావస్వేచ్ఛ యిటువంటి అనేక అంశాలపై చర్చావేదికలు నిర్వహించేది. కవిత్వసమ్మేళనాలు, నాటకాలు వుంటూండేవి. ఇలా ప్రతి జిల్లాలో జరుపుతూ వచ్చి చివరకు రాష్ట్రస్థాయిలో మద్రాసులో 1951 డిసెంబరు 13 నుండి 16 వరకు సదస్సు జరిపింది. అనుకున్న దానికంటె ఎక్కువగా జనం విరగబడ్డారు. ఐదు నాటకాలు ప్రదర్శించబడ్డాయి. వాటిలో ఒకటి తెలుగు! ఆ సభలో ప్రసంగిస్తూ అణ్నా "కమ్యూనిస్టుల్లో కొందరు మాతో కలిసి పెరియార్ వద్ద పనిచేశారు. నేను వారి పార్టీలో చేరడానికి, కలిసి పని చేయడానికి రెడీగా వున్నాను. అయితే ఒక్కటే షరతు - వాళ్లు వాళ్ల పార్టీకి ముందు 'ద్రవిడ' అనే పదం చేర్చాలి." అన్నాడు. ఈ విధంగా తాము కమ్యూనిస్టుల్లాగే నిజాయితీపరులమని, కార్మిక పక్షపాతులమని ప్రజలకు చెప్పుకున్నాడు. పెరియార్ కానీ, కమ్యూనిస్టులు కానీ డిఎంకెతో కలిసి పని చేయడానికి ఉత్సాహం చూపలేదు. చూపరని అణ్నాకూ తెలుసు.

1951లో అణ్నాకు మళ్లీ సినిమా ఛాన్సు వచ్చింది. ఎవి మెయ్యప్పన్ చెట్టియార్ తంజావూరులో "ఒరు ఇరవు" నాటక ప్రదర్శనకు వెళ్లాడు. అది అణ్నా రాసిన నాటకం. ఒక రాత్రిలో మొత్తం కథ నడుస్తుంది. మెయ్యప్పన్ స్నేహితుడు "దీన్ని సినిమాగా తీయవచ్చుకదా" అని సూచించాడు. ఇద్దరూ కలిసి తిరుచ్చి వెళ్లి అణ్నాను కలిశారు. అక్కడ అణ్నా నటుడు ఎస్ఎస్ రాజేంద్రన్ పెళ్లి నిర్వహిస్తున్నాడు. మెయ్యప్పన్ అడగగానే నాటకం హక్కులు యిచ్చాడు. "మీరే స్క్రిప్టు రాసి యివ్వండి. పదివేల రూపాయలు యిస్తాను" అన్నాడు మెయ్యప్పన్. కొన్ని రోజులకు అణ్నా ఎవియం స్టూడియోకు వచ్చి ఒక రాత్రి 10 గంటలకు గదిలో కూర్చుని మర్నాడు పొద్దున్న కల్లా 300 పేజీల స్క్రిప్టు, స్క్రీన్‌ప్లే రాసి యిచ్చేశాడు. సినిమా 1951లో రిలీజైంది. బాగా ఆడలేదు కానీ మంచి సినిమా అని మెయ్యప్పన్‌కు తృప్తి కలిగింది.

1952లో ఎన్నికలు వచ్చాయి. పదవీలాలసతో ఎన్నికల కోసమే డిఎంకె వారు తనను విడిచి వెళ్లిపోయారని పెరియార్ అన్నాడు కాబట్టి ఆ ఆరోపణ నిజం కాదని నిరూపించుకోవడానికి అణ్నా ఆ ఎన్నికలలో పోటీ చేయలేదు. "ద్రవిడులను సంప్రదించకుండా తయారుచేసిన రాజ్యాంగం ప్రకారం జరిగే ఎన్నికలు కాబట్టి బహిష్కరిస్తున్నాం" అని ప్రకటన యిచ్చి తప్పుకున్నాడు. (అదే రాజ్యాంగం ప్రకారం జరిగిన 1957 ఎన్నికలలో మాత్రం పోటీ చేశాడు). "ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఓడించడమే మా లక్ష్యం కాబట్టి కాంగ్రెస్ వ్యతిరేకుల్లో నిజాయితీ పరులు, అభ్యుదయవాదులు ఎవరున్నారో చూసి వారికి ఓటేస్తాం." అని ప్రకటించాడు. అప్పటిదాకా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా జస్టిస్ పార్టీని సమర్థిస్తూ వచ్చిన పెరియార్ అప్పటికి జస్టిస్ పార్టీ మూతపడడంతో ఆ ఎన్నికలలో కమ్యూనిస్టులకు మద్దతు యిచ్చాడు. 'ఇది కలకాలం వుండేదేమీ కాదు, రైల్లో కలిసినప్పుడు ఏర్పడే స్నేహం లాటిదే, స్టేషన్‌లో దిగాక మర్చిపోతాం' అని వివరణ యిచ్చాడు.

అణ్నా మాత్రం షరతు పెట్టాడు - తమ మద్దతు కోరేవారు ద్రవిడనాడు ఏర్పాటుకై అసెంబ్లీలో పార్లమెంటులో పని చేస్తామని ప్రమాణం చేస్తూ కాగితం రాసి యివ్వాలి! 45 మంది అలా సంతకాలు పెట్టి యిచ్చారు. వారిలో కామన్‌వీల్ పార్టీ, తమిళనాడు టాయిలర్స్ పార్టీ వాళ్లు, స్వతంత్ర అభ్యర్థులు వున్నారు. కమ్యూనిస్టులు మాత్రం యీ షరతుకి ఒప్పుకోలేదు. వారిది అంతర్జాతీయ దృక్పథం. డిఎంకె జాతీయ కాదు కదా, ప్రాంతీయ దృక్పథం. ద్రవిడనాడు పట్ల యింత వెఱ్ఱి ఎందుకు? అంటే ఆ పేరుతో నాలుగు దక్షిణాది రాష్ట్రాలనూ ఏలేద్దామని డిఎంకె అనుకుంది. ఆర్యుల బూచి చూపించి దాక్షిణాత్యు లందరినీ ఆకర్షిద్దామని చూసింది. కానీ తమిళులు తప్ప వేరెవరూ వారి వలలో పడలేదు. అది తెలుసుకునేసరికి అణ్నాకు పదేళ్లు పట్టింది. ఇక ఆ పైన ద్రవిడనాడు నినాదం పక్కన పడేశాడు. (సశేషం) **- ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**